# మీసం



**అవేళ** పదహార్రోజుల పండుగ. భార్యకు సర్ప్రైజ్ గిఫ్ట ఏదిస్తే బాగుంటుందాని శేషగిరి ఆలోచిస్తున్నాడు. " త్వరగా తెమలండి, గుడికెళ్ళి పూజ చేయించుకొందా మనుకొన్నాంగా. నేను చప్పున తలంటు పోసుకు వచ్చేస్తాను." అని రజని చెప్పి బాత్రూమ్కి వెళ్ళి పావుగంటైనా శేషగిరి అద్దం ముందునుంచి లేవలేదు. ఏం చేసి తనను సంతోషపెట్టాలా అన్న ఆలోచనతోనే సతమతమవుతున్నాడు. ఏమిచ్చినా పర్సనల్గా ఉండాలి. చీర ఎలాగూ కొన్నాడు. హేండ్బాగ్ లాటివి పర్సనల్ టచ్ ఉన్నవి కావు. ఆలోచిస్తూ మీసం మెలివేస్తుంటే, చప్పున మీసం గురించే ఆలోచన

పోయింది.

'మొదటిరాత్రే రజని మీసం గురించి గోల పెట్టింది. 'గుచ్చుకుంటోందండీ' అని. పాపం సున్నితమైన చర్మం, ముద్దుపెట్టబోయినప్పుడల్లా పై పెదవి మండేదట. నిజమే కావచ్చు. ఆమె మొహమంతా రాత్రి ముద్దాడక, పగలు చూస్తే ఎర్రచారలు కనబడేవి. తన వెంట్రుకలు కోసుగా ఉంటాయా? తనకేం తెలుసు? తనను తాను ముద్దాడలేదుగా! మంటపుడుతూనే ఉంటుంది కాబోలు, లేకపోతే తను మాత్రం ఎందుకు గగ్గోలు పెడుతుంది?

అసలా గులాబి బుగ్గలు చూస్తే కొరక బుద్దేస్తుంది. సౌకుమార్యం తెలిసినవాడు కాబట్టి తను ముద్దులతో సరిపెడుతున్నాడు. అప్పటికీ ముద్దాడగానే వెంటనే అరచేత్తో నిమురుతున్నాడు కూడా. అయినా 'ఇలా అయితే ముద్దు పెట్టుకోనివ్వనంతే' అంటూ రజని బుగ్గలు రెండు చేతులతో మూసేసుకుంటుంది. అదే అదనని తను పెదాల మీద గట్టిగా ముద్దు పెట్టేస్తున్నాడు. "ఉండండి, మీ పెదాలు కొరికేస్తాను, అప్పుడు కానీ నా బాధ మీకు తెలీదు" అంటూ ఓ సారి రెండు పెదాలు పళ్ళతో కరిచిపెట్టుకుంది కూడాను. "ఏం తిక్క కుదిరిందా?" అంది కాస్సేపటికి వదిలేసి. "అదేం లేదు, హాయిగా నీ నాలిక దొరికింది, మళ్ళీ కొరికేయి" అన్నాడు తను. "ఇలా సిగ్గులేని వాళ్ళతో వేగలేం బాబూ" అంటూ మూతి వంకర్లు తిప్పింది.

అంతా బాగానే వుంది కానీ మీసం సమస్య తీరలేదు. చిన్నప్పట్నుంచీ ఎంతో ముద్దుగా పెంచిన మీసం. దాన్ని చూసుకుని తను గర్వపడడం చూసి కాబోలు తీసేయమని రజని అడగలేదు. అయినా ఆమె కోసం ఏదైనా చేయకపోతే ఎలా? అడక్కుండానే కోరిక తీర్చే భర్తంటే భార్యలు పడి ఛస్తారని చదివేడు. అడిగితే ఆత్మాభిమానం చంపుకున్నట్టేగా. అలా చంపుకోవడం ఆమెకు ఇష్టంలేక బాధ పడ్డానికే నిశ్చయించుకుంది కాబోలు. కానీ తన మనసెరిగి ఇలాటి చిన్న కోరికలు తీరిస్తేనే ఇద్దరి మధ్యా అవగాహన పెంపొందుతుందని పత్రికల్లో చదివేడు.

కానీ ఇది చిన్న కోరికా? తక్కినవాళ్ళకి అవునేమో కానీ తనకు మాత్రం కాదు. తన మీసం అంటే తనకెంతో మక్కువ. కాలేజీ రోజుల్లో తనని చాలామంది అమ్మాయిలు ఇష్టంగా చూసేవారంటే దానికి కారణం మీసమనే తన నమ్మకం. మీసం తీసేస్తే ఓ సారి నాటకంలో వేషం ఇస్తామన్నారు. తీయను పొమ్మన్నాడు. పోతే పోయింది వేషం. మీసం దక్కింది.

ఆఫీసులో కూడా 'మీ మీసం షేపు బాగుంటుందండీ' అంటారు కొలీగ్స్. ఆఫ్‌కోర్సు, అనేవాళ్ళు మగాళ్ళే. ఆడవాళ్ళు ఉండుంటే ఏమనేవారో. దాని వల్ల కష్టాలు వాళ్ళకు తెలుస్తాయో, లేదో!? అయినా బయట చూడడం వేరు. అనుభవించడం వేరు.

అలా రజని పక్షాన్నుండి ఆలోచిస్తే, ఒకలా చూస్తే పాపం అనిపిస్తుంది. తొలిరేయి 'నా కోసం సిగరెట్లు మానేయండి' అని కూడా అడగలేదు. ఒకవేళ అడిగినా ఇబ్బందే. తనకు అలవాటే లేదు. అందువల్ల 'నీకోసం ఈ త్యాగం చేసాను' అని చెప్పుకొనే అవకాశం లేకుండా పోయింది. పోనీ ఈ మీసం తీసేసి తన ప్రేమను నిరూపించుకుంటే? అమ్మో, మీసం తీసేయడమే? తన మొహం తనకే ఏదోలా ఉంటుంది, ఉంటే ఉందిలే, భార్యాభర్తల మధ్య అవగాహనకు ఈ రెండున్నరంగుళాల మీసం అడ్డువస్తే దాన్ని నిర్దాక్షిణ్యంగా తీసేయాల్సిందే.'

మీసం గొరిగేసేటప్పుడు శేషగిరి చేయి వణికింది. కన్నీళ్ళు రాబోయి కూడా. కానీ 'హిందీ యాక్టర్‌లా ఉన్నాను.' అనుకొని తనను తాను ఓదార్చుకున్నాడు. రజనికి కలగబోయే ఆనందాన్ని తలచుకుని ఊరడించుకున్నాడు. శేషగిరి స్నానాల గదిలో నుండి బయటకు వచ్చేసరికి రజని తయారై ఉంది. అతన్ని చూస్తున్నే తెల్లబోయింది. 'ప్లెజంట్లీ షాక్‌డ్' అనే పదం స్ఫురించింది శేషగిరికి.

వాళ్ళమ్మగారు దగ్గర్లో ఉందని కాబోలు, ఏమీ కామెంట్ చేయలేదామె. గుడికి రిక్షాలో వెళ్ళేటప్పుడు కూడా ఏమీ మాట్లాడలేదు. రిక్షావాడు చిన్నప్పణ్నుంచీ తెలిసున్నవాడని కాబోలు. గుడికి వెళ్ళేటప్పటికే పూజ ప్రారంభించేస్తున్నారు. తిరిగొచ్చేవరకూ మాట్లాడడానికి కుదరలేదు.

అప్పటిదాకా ఒక్కసారి కూడా భార్య ముఖం మీద నవ్వు కనబడకపోయేసరికి శేషగిరికి అశ్చర్యం వేసింది. మనస్సులో ఏదో అనుమానం మొలకెత్తింది. భుజం మీద చేయి వేయబోయేసరికి ఆమె చేయి తోసేయడంతో అది బలపడింది.

"ఆ పేడిమొహంతో దగ్గరికి రాకండి" అంటూ చీదరించుకుంది, తన ప్రవర్తనకు కారణం తేలతెల్లం చేస్తూ.

శేషగిరికి ఏం మాట్లాడాలో తెలియలేదు. "నీ కోసమే.. మండుతోందంటేను.., నాకిష్టం లేకపోయినా..." అంటూండగానే "పోనీ తీసేముందు అడగలేక పోయారా?" అంటూ గయ్‌మంది.

"మంట పుడుతోందని సణుగుతున్నావుగా..." అంటూ శేషగిరి నాన్చేశాడు. "సణిగితే మాత్రం? మంటపుట్టే పనులు సవాలక్ష ఉన్నాయి, అవన్నీ మానేస్తారా?" అంది రజని ఖోర్సుగా.

అతనికి బుర్ర తిరిగింది. ఆడవాళ్ళు ఇలా మాట్లాడగలరని అప్పుడతనికి తెలీదు.

"....మీరివాళే బండెక్కండి, మీసం మొలిచిందని ఉత్తరం రాసాకే కాపురానికి వస్తాను." అంది. రజని ఖరాఖండీగా.

ఇది జరిగి పదేళ్ళయ్యింది. ఇప్పటిదాకా భార్యకు ఏది నచ్చుతుందో, ఏది నచ్చదో, ఎంజాయ్ చేస్తోందని తను అనుకునే విషయాల్లో కూడా ఎందుకు సణుగుతుందో అతనికి ఇప్పటికీ తెలియదు!

●

(ఆంధ్రప్రభ ఆగస్టు 1998)